# భారత్ జైత్రయాత్ర

## అడుగడుగునా జన నీరాజనం



### స్వదేశానికి టీమ్‌ఇండియా

### ముంబై విజయోత్సవ ర్యాలీలో జనసంద్రం





ప్రధానితో కోహ్లీ..



..రోహిత్



..సిరాజ్



..ద్రవిడ్

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఐసీసీ టీ20 ప్రపంచ చాంపియన్లుగా నిలిచిన భారత క్రికెట్ జట్టు స్వదేశానికి చేరుకుంది. 13 ఏండ్ల తర్వాత ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడి స్వదేశానికి తిరిగొచ్చిన టీమ్‌ఇండియాకు 'ఢిల్లీ నుంచి ముంబై' దాకా అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన అనంతరం ముంబైకి వచ్చిన రోహిత్ సేన 'వన్స్ ఇన్ ఎ లైఫ్ టైమ్ మూవ్‌మెంట్'ను తనివితీరా ఆస్వాదించింది. వీరుల విజయోత్సవ ర్యాలీకి అరేబియా తీరం అభిమాన జన సంద్రమైంది. నారీమన్ పాయింట్ నుంచి ఎటుచూసినా జనం..! జనం..!! జనం..!!! రోజూ సాయంత్ర వేళల్లో ప్రశాంతంగా ఉండే ఆ ప్రాంతమంతా ఇసుకేస్తే రాలనంత జన ప్రభంజనాన్ని తలపించింది. 'ఇండియా.. ఇండియా', 'ముంబై చ రాజా.. రోహిత్‌శర్మ', 'కోహ్లీ.. కోహ్లీ' అంటూ అభిమానులు చేసిన విజయనినాదాలకు అరేబియా సంద్రపు అలల హోరు మూగబోయింది. 'లాస్ట్ బట్ నాట్ ద లీస్ట్' అన్నట్టుగా జైత్రయాత్ర ముగిశాక బీసీసీఐ 'మెన్ ఇన్ బ్లూ'కు ఇస్తామని చెప్పిన రూ. 125 కోట్ల చెక్కును 36 వేల మంది అభిమానుల సమక్షంలో అందజేసింది.



ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన టీమ్‌ఇండియా క్రికెటర్లను గురువారం ఢిల్లీలో ప్రత్యేకంగా అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ: ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు ఆరు రోజుల విరామం తర్వాత స్వదేశానికి చేరుకుంది. బుధవారం సాయంత్రం బార్బడోస్ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరిన టీమ్‌ఇండియా గురువారం ఉదయం 6 గంటలకే ఢిల్లీ విమానాశ్రయంలో దిగింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వేలాది అభిమానులు ఘనస్వాగతం పలకగా చాణిక్యపురిలోని ఐటీసీ మౌర్య హోటల్‌కు వెళ్లిన భారత జట్టు.. అక్కడ్నుంచి నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో ఆయనతో సమావేశమైంది. 'చాంపియన్ల'ను అభినందించిన అనంతరం వారితో కలిసి అల్పాహారం చేసిన మోదీ.. జట్టుతో కాసేపు ముచ్చటించి వారి అనుభవాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ముగిశాక టీమ్‌ఇండియా ప్రత్యేక విమానంలో దేశ ఆర్థిక రాజధానికి పయనమమైంది.

### జనం.. నీరాజనం

అనుకున్న షెడ్యూల్ (సాయంత్రం 5 గంటలకు) కంటే విజయయాత్ర రెండు గంటల (రాత్రి 7.30 గంటలకు మొదలైంది) పాటు ఆలస్యమైనా అభిమానులు తమ అభిమాన ఆటగాళ్ల కోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆనందంగా వేచి చూశారు. ఇక ఓపెన్ టాప్ బస్సులో విక్టరీ పరేడ్ మొదలయ్యాక ఆటగాళ్లకు అడుగడుగునా జననీరాజనమే. రోహిత్, కోహ్లీ, పాండ్యా, సూర్య, పంత్, సిరాజ్ అభిమానులను ఉత్సాహపరుస్తూ జైత్రయాత్రను నడిపించారు. అంగరంగ వైభవంగా సాగిన జైత్రయాత్ర రెండు గంటల తర్వాత వాంఖడే చేరిన భారత జట్టుకు బీసీసీఐ చిరు సత్కారం చేసింది. అధ్యక్షుడు రోజర్ బిన్నీ, సెక్రటరీ జై షా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా భారత జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ చెక్‌ను అందజేశారు. అనంతరం వాంఖడేలో అభిమానుల కేరింతల నడుమ ఆటగాళ్లంతా వారికి కృతజ్ఞతలు చెబుతూ స్టేడియం అంతా కలియతిరిగారు. తమ ప్రపంచకప్ అనుభవాలను కెప్టెన్ రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ, బుమ్రా, చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పంచుకున్నారు. తమకు మద్దతు పలికేందుకు స్టేడియానికి వేలాదిగా తరలివచ్చిన అభిమానులకు క్రికెటర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు భారీగా పోలీసులను మోహరించారు.

# ఇక పొట్టి పోరు

**నేటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా మహిళల టీ20 సిరీస్ • ఫుల్ జోష్‌లో టీమ్‌ఇండియా**

చెన్నై: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే, టెస్టు సిరీస్‌లను గెలిచి జోరు మీదున్న భారత మహిళల క్రికెట్ జట్టు శుక్రవారం నుంచి మొదలుకాబోయే టీ20 సిరీస్‌లో తలపడనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం చెన్నై వేదికగా జరుగబోయే తొలి టీ20లో సఫారీలతో అమీతుమీ తేల్చుకోనేందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా సిద్ధమైంది. వన్డేలతో పాటు ఏకైక టెస్టునూ ఓడిన సౌతాఫ్రికా పొట్టి ఫార్మాట్‌లో అయినా భారత్‌కు గట్టిపోటీనిచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఈ నెలలో జరిగే ఆసియా కప్‌తో పాటు అక్టోబర్‌లో బంగ్లాదేశ్ వేదికగా జరుగబోయే టీ20 ప్రపంచకప్‌నకు ముందు భారత్‌కు ఇదే చివరి పరిమిత ఓవర్ల సిరీస్.

**సూపర్ ఫామ్:**

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు చేసిన ఓపెనర్ స్మృతి మంధాన టెస్టుల్లోనూ శతకం బాది ఫుల్ ఫామ్‌లో ఉంది. వన్డే సిరీస్‌లో విఫలమైనా షఫాలీ వర్మ చెన్నై టెస్టులో డబుల్ సెంచరీ బాది టచ్‌లోకి వచ్చింది. హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ కూడా టచ్‌లోనే ఉన్నారు. బౌలింగ్‌లో పేసర్లు రేణుకా, పూజా వస్త్రకార్, అరుంధతిరెడ్డి రాణిస్తుండగా స్పిన్నర్లు దీప్తి శర్మ, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్ కీలకం కానున్నారు.




# జొకో జోరు

**మూడో రౌండ్‌కు సెర్బియా స్టార్**

**రెండో రౌండ్ చేరిన యూకీ బాంబ్రీ**



లండన్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ఆ దిశగా మరో అడుగు ముందుకేశాడు. వింబుల్డన్ పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో జొకో 6-3, 6-4, 5-7, 7-5తో జేకబ్ ఫియర్న్లీ(బ్రిటన్)ను ఓడించి మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో గతేడాది ఈ టోర్నీ రన్నరప్ ఒన్స్ జబెర్ 6-1, 7-5తో రాబిన్ మోంట్‌గొమెరి(అమెరికా)ను చిత్తుచేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ, ఫ్రెంచ్ సహచరుడు అల్బనో ఒలివెట్టి ద్వయం 6-4, 6-4తో కజకిస్థాన్ ద్వయం అలెగ్జాండర్ బబ్లిక్-షెవ్‌చెంకోను చిత్తు చేసింది.

## రెండో రౌండ్‌కు రజావత్



కల్గరి: కెనడా ఓపెన్‌లో భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ రెండో రౌండ్‌కు చేరాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 39వ ర్యాంక్ రజావత్ 17-21, 21-16, 21-14తో తన కంటే మెరుగైన ప్రత్యర్థి అయిన డెన్మార్క్ ఆటగాడు, 8వ సీడ్ రాస్మస్ జెమ్కెను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో తన్యా హేమంత్ 21-13, 20-22, 21-14తో కెనడాకే చెందిన జాకీ డెంట్‌ను ఓడించగా అనుపమ ఉపాధ్యాయ 21-11, 21-11తో రాచెల్ (ఐర్లాండ్)ను చిత్తుచేసి రెండో రౌండ్‌కు చేరింది.

## రితిక డబుల్ ధమాకా



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్ సాగర్ వేదికగా జరుగుతున్న 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌లో రితికా దంగీ రెండు టైటిళ్లతో మెరిసింది. గురువారం జరిగిన ఐఎల్‌సీఏ-6 ఓపెన్, మహిళల కేటగిరీలో రితిక విజేతగా నిలిచి ఆకట్టుకుంది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ఈ ఐఎన్‌డబ్ల్యూటీసీ సెయిలర్..అద్భుత ప్రదర్శన కనబరిచింది. మిగతా రేసులలో మోహిత్ సైనీ ఐఎల్‌సీఏ-7 రేసులో విజేతగా నిలువగా, అంకిత్‌సింగ్, సౌమ్య సింగ్ వరుసగా ఐఎల్‌సీఏ బాలుర, బాలికల టైటిళ్లను దక్కించుకున్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.